సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 11 । డిసెంబర్ । 2024



లే ఉమా.. లేరా పెద్దోడా..

కోనసీమ జిల్లా ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద పంట కాలువలోకి కారు బోల్తా కొట్టిన ఘటన ఓ వ్యక్తికి తీరని విషాదాన్ని మిగిల్చింది.


II లో



ఆక్వా రైతుల దాష్టీకం

హైకోర్టు ఆదేశాలను అతిక్రమించడమే కాకుండా, ఓ యువకుడిని ఆక్వా రైతులు తాళ్లతో నిర్బంధించి చితకబాదిన ఘటన ఉప్పలగుప్తం మండలంలోని సన్నవిల్లిలో చోటు చేసుకుంది.

డెల్టాలకు 11,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 11,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మరో 14,183 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

పింఛన్ ఉంటుందో.. ఊడుతుందో..!

- తనిఖీలతో లబ్ధిదార్లలో ఆందోళన
- తాడిమళ్లలో 447 మంది పింఛన్ల పరిశీలన



తాడిమళ్లలో పింఛన్ల తనిఖీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ మూర్తి

నిడదవోలు రూరల్: సామాజిక పింఛన్లపై కూటమి ప్రభుత్వం తనిఖీలు చేపట్టడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామంలో రెండో రోజైన మంగళవారం కూడా పింఛన్ల తనిఖీ చేపట్టారు. డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి పర్యవేక్షణలో గ్రామంలో 453 మంది లబ్ధిదారుల వివరాలపై తనిఖీ చేపట్టగా 447 మంది వివరాలను అధికారుల బృందం యాప్‌లో నమోదు చేసింది. ఆరుగురు అందుబాటులో లేరు. ఒకేసారి 13 అధికార బృందాలు వివిధ మండలాల నుంచి తనిఖీ చేయడానికి గ్రామానికి రావడంతో లబ్ధిదార్లు తమ పింఛన్ ఉంటుందో.. ఉండదోనని ఆందోళన చెందుతున్నారు. నమ్మి గెలిపిస్తే చంద్రబాబు తమ పింఛన్లకు ఎసరు పెడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ల తనిఖీలో కొవ్వూరు డీఎల్‌డీఓ ఎ.స్లీవారెడ్డి, ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి టి.గోపాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రసాదం కూడా భక్తితోనే పెట్టాలి



రామానుజ జీయర్ స్వామి

రాజమహేంద్రవరం రూరల్: భక్తులకు ప్రసాదం భక్తితోనే పెట్టాలని త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. విసుక్కుంటూ పెట్టడం, ఎన్నిసార్లు తింటావంటూ హేళనగా మాట్లాడటం చేయరాదన్నారు. రాజవోలు గాయత్రీ నగర్ రామాలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీమద్భాగవత సప్తాహంలో భాగంగా మంగళవారం ఆయన తన ప్రవచనం కొనసాగించారు. భక్తులంటే భగవద్బంధువులన్నారు. అందుకే వారికి భక్తితో అన్నదానం చేస్తే ఎంతో మంచి ఫలితం వస్తుందని చెప్పారు. భక్తులకు ప్రసాదం, అన్నం ప్రేమతో, ఆదరణతో పెట్టడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అలా చేస్తేనే భగవంతుడు ఆనందిస్తాడని, పరమాత్మ ఆనందించే పనులు మనం చేయాలని అన్నారు. తద్వారా మనకు మంచి జరుగుతుందని స్వామీజీ చెప్పారు.

జీజీహెచ్ ఓఎస్‌డీగా భాస్కర్‌రెడ్డి

సాక్షి, రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాస్పత్రి (జీజీహెచ్) ప్రత్యేక అధికారిగా ఎస్.భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, కలెక్టర్ పి.ప్రశాంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌ఆర్‌సీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా వ్యవహరిస్తున్న భాస్కర్‌రెడ్డిని జీజీహెచ్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్‌డీ)గా నియమించారు. ఆస్పత్రిలో ఆయన నిర్వర్తించాల్సిన విధులపై స్పష్టత ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జీజీహెచ్ ఓఎస్‌డీ హోదాలో ఆసుపత్రిని వారంలో కనీసం రెండుసార్లు ఆయన సందర్శించాలి. రోగులు, వారి సహాయకుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, ఆసుపత్రి సిబ్బంది సహకారంతో సమస్యలను పరిష్కరించాలి. ఆసుపత్రిలో వసతుల కల్పనను పర్యవేక్షించడంతో పాటు, వైద్య సదుపాయాలు రోగులకు అందుతున్న తీరుపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదించాలి. ఇన్‌పేషంట్లకు అందుతున్న వైద్య సేవల నాణ్యతను పర్యవేక్షించాలి.

మైనార్టీ సంక్షేమ అధికారిగా సరోజిని

జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిగా పి.సరోజిని నియమితులయ్యారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న ఆమె పోస్టింగ్ కోసం వేచి చూస్తున్నారు. ఆమెను జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

సౌదీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్, ఓమ్ క్యాప్, ఆల్ యూసుఫ్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యాన బీఎస్సీ నర్సింగ్ చదివిన వారికి సౌదీ అరేబియాలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండలరావు మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సౌదీ అరేబియా రీహేబిలిటేషన్ సెంటర్‌లో పని చేయడానికి ఆసక్తి ఉన్న, 18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. ఏదైనా ఆసుపత్రిలో ఏడాదిన్నర పాటు పని చేసిన అనుభవం ఉండాలని తెలిపారు. వీసా, విమాన టికెట్లతో కలిపి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.37,500 చెల్లించాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.78 వేల నుంచి రూ.89 వేల వరకూ జీతం వస్తుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 15లోగా 99888 53335, 87901 18349 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.



జ్యోతి వెలిగించి, సమావేశాన్ని ప్రారంభిస్తున్న బొత్స సత్యనారాయణ



ప్రజల గళమై.. సమరదళమై..



"సార్వత్రిక ఎన్నికల్లో అలవి కాని హామీలు ఇచ్చి, ప్రజలను నమ్మించి, వంచించిన కూటమి సర్కారుపై సమర కేతనం ఎగురవేద్దాం.. ఆరు నెలలుగా 'పచ్చ' మూకలు సాగిస్తున్న అకృత్యాలపై పిడికిళ్లు బిగిద్దాం.. ప్రభుత్వ దమనకాండతో అన్యాయానికి గురయ్యే ప్రతి కార్యకర్తకూ అండగా నిలుద్దాం.. మనం నమ్మిన, మనల్ని నమ్మిన ప్రజల గళమై.. వారి తరఫున చేయీచేయీ కలిపి పోరాడదాం.. సమరదళమై కదులుదాం" అంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులకు పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ దిశానిర్దేశం చేశారు.

- చేయీ చేయీ కలిపి ప్రజాపోరాటాలు
- మాట తప్పిన కూటమిపై దశలవారీ పోరు
- 13న 'అన్నదాతకు అండగా' కలెక్టర్లకు వినతి
- 27న విద్యుత్ చార్జీలపై ఎస్ఈ కార్యాలయాల వద్ద ఆందోళనలు
- వచ్చే నెల 3న విద్యా సమస్యలపై నిరసన
- పార్టీ బలోపేతానికి నెలాఖరులోగా కమిటీలు
- కేడర్ మనోభావాలకు అత్యధిక ప్రాధాన్యం
- వచ్చే నెల నుంచి జగన్ జిల్లాల పర్యటన
- వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో రీజినల్ కో ఆర్డినేటర్ బొత్స



సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ. వేదికపై మూడు జిల్లాల పార్టీ నేతలు



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

నేతలేమన్నారంటే..



- ఓటమి ఒంటరి వంటిది. అదే విజయానికి బంధువులు ఎక్కువ. ఓటమితో కోల్పోయిన మనోధైర్యాన్ని పార్టీ శ్రేణుల్లో తిరిగి కల్పించే లక్ష్యంతో నాయకులు ముందుకు సాగాలి. సూపర్ సిక్స్ హామీలు గాలికి వదిలేసిన కూటమి సర్కార్‌పై ప్రజాపోరాటాలు తప్పవు. ప్రతి కార్యకర్తకూ పార్టీ అండగా ఉంటుంది.
  – కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు



- పార్టీ కార్యకర్తలకు పోరాటాలు కొత్త కాదు. జగన్‌ను మరోసారి సీఎంను చేసేందుకు అందరూ కలసికట్టుగా ఉండాలి.
  – దాడిశెట్టి రాజా, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ కో ఆర్డినేటర్



- పోరాటాలు చేయని పార్టీలు కాలగర్భంలో కలిసిపోతాయనే విషయాన్ని చరిత్ర చెబుతోంది. నిత్య పోరాటాలతోనే నాయకత్వం బలపడుతుంది.
  – కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ



- పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.
  – విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పి.గన్నవరం కో ఆర్డినేటర్



- ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి దళితులు, వైఎస్సార్ అభిమానులను వేధిస్తున్న కూటమి సర్కార్‌కు షాక్ ఇవ్వాలి.
  – బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ



- జగన్‌కు ఆయాచితంగా ముఖ్యమంత్రి పదవి రాలేదు. అప్పట్లో కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రబలమైన శక్తిని ఎదురొడ్డి పోరాడి, సొంతంగా పార్టీ పెట్టి, సీఎం అయ్యారు. కార్యకర్తలు ఇదే స్ఫూర్తితో పోరాటాలతోనే విజయాలు సాధించాలి. – తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట కో ఆర్డినేటర్





- సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసుకునేలా కలిసికట్టుగా ముందడుగు వేసి, కులం, మతం చూడకుండా సంక్షేమాన్ని అందించిన జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవాలి.
  – వంగా గీత (మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం కో ఆర్డినేటర్), మాజీ ఎంపీ చింతా అనురాధ



- కూటమి సర్కార్ 6నెలల పాలనలో ఆశలు ఆవిరైపోయి, ప్రజల్లో అంతర్మథనం మొదలైంది.
  – పొన్నాడ వెంకట సతీష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే, ముమ్మిడివరం కో ఆర్డినేటర్



- వైఎస్సార్ సీపీకి వచ్చిన 40 శాతం ఓట్లను తక్కువగా అంచనా వేయవద్దు.
  – డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాజమహేంద్రవరం పార్లమెంటరీ కో ఆర్డినేటర్



- పదేళ్లు పోరాటం చేసి అధికారంలోకి వచ్చాం. డైనమిక్ లీడర్ బొత్స నాయకత్వంలో జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తారనే నమ్మకం ఉంది. – ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కాకినాడ సిటీ కో ఆర్డినేటర్



- ఆరు నెలలుగా కార్యకర్తలు పడుతున్న ఇబ్బందులు, రైతుల బాధలు, దళితులకు ఉచిత విద్యుత్ తొలగింపు వంటి వాటిపై చేసే పోరాటాల్లో మనమంతా ముందుండాలి. –ముద్రగడ పద్మనాభం, మాజీ మంత్రి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కార్యకర్తల మనోభావాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే బృహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శాసన మండలిలో విపక్ష నేత, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు అధ్యక్షతన స్థానిక సూర్య కళా మందిరంలో మంగళవారం జరిగిన వైఎస్సార్ సీపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ దమనకాండతో అన్యాయానికి గురయ్యే ప్రతి కార్యకర్తకు నాయకత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వం అకృత్యాలు సాగిస్తోందన్నారు. ఈ తరుణంలో పార్టీ శ్రేణులకు అండగా నిలిచి, భవిష్యత్తుపై దిశానిర్దేశం చేసేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే నెల నుంచి జిల్లాల పర్యటనలకు శ్రీకారం చుట్టనున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిల్లా, మండల, గ్రామ స్థాయి పార్టీ కమిటీలను ఈ నెలాఖరులోగా నియమించాలని సూచించారు. ఈ కమిటీలను బలీయంగా తీసుకువచ్చి, జిల్లాల సమావేశాలు ఏర్పాటు చేసుకుందామని అన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై..

విద్యుత్ చార్జీలు ఒక్క పైసా కూడా పెంచేది లేదని ఎన్నికల ముందు చంద్రబాబు నమ్మించి, ఇప్పుడు మోసం చేశారని బొత్స చెప్పారు. ఇప్పుడు ప్రతి వినియోగదారుపై యూనిట్‌కు రూ.1.20 చార్జీల భారం మోపుతున్నారని, దీనిని వెనక్కు తీసుకునేంత వరకూ ప్రజల తరఫున పోరాడాలని అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 27న ఎస్ఈ కార్యాలయాల వద్ద నిర్వహించే ఆందోళనకు అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరు నెలల్లో రూ.60 వేల కోట్లు అప్పులు తెచ్చి, కనీసం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము కూడా ఇవ్వలేదని చెప్పారు. ఈ ఆరు నెలల్లో ఏం ఉద్ధరించారని ప్రశ్నించారు. ఈ అంశంపై వచ్చే నెల 3న విద్యార్థులకు సంఘీభావంగా నిరసన తెలపాలని బొత్స సూచించారు.

ప్రజల తరఫున ఉద్యమాలు

ఎన్నికల హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వంపై ప్రజల తరఫున పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు బొత్స పిలుపునిచ్చారు. అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన పార్టీ రాష్ట్ర స్థాయి సమీక్షలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా.. ప్రభుత్వంపై మూడు దశల్లో ఆందోళనకు అందరూ సమాయత్తం కావాలని అన్నారు. రైతు సమస్యలపై ఈ నెల 13న కలెక్టర్లకు విజ్ఞాపనలు అందజేయాలని సూచించారు. అధిక వర్షాలు, వాయుగుండాలతో తడిసిన పంటను కూటమి ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయకుండా రైతులకు అన్యాయం చేస్తోందని, వారి పక్షాన సర్కార్ తీరును ఎండగట్టాలని అన్నారు. రైతులకు రూ.20 వేలు ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో చెప్పారని, ఇప్పుడు అన్నదాతలను మోసం చేసి, ఉలుకూ పలుకూ లేకుండా ఉన్నారని విమర్శించారు. అసలు ఆ సొమ్ము ఎప్పుడిస్తారో చెప్పాలంటూ ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

తొలుత మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నేతలు జ్యోతి ప్రజ్వలనతో నివాళులర్పించారు. పార్టీ ప్రతినిధులను వైఎస్సార్ సీపీ ప్రచార కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు ఆహ్వానించారు. సమావేశంలో ఎమ్మెల్సీ అనంతబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ అనుబాబు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, పాముల రాజేశ్వరీదేవి, పెద్దాపురం, రామచంద్రపురం, ప్రత్తిపాడు కో ఆర్డినేటర్లు దవులూరి దొరబాబు, పిల్లి సూర్యప్రకాష్, ముద్రగడ గిరిబాబు, పార్టీ నాయకుడు యనమల కృష్ణుడు, మున్సిపల్ చైర్‌పర్సన్లు రెడ్డి సత్యనాగేంద్రమణి, పతివాడ నూకదుర్గారాణి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, కౌడా మాజీ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న సాగర్, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ మేయర్ సరోజ, అనుబంధ విభాగాల ప్రతినిధులు గిరజాల బాబు, జిన్నూరి వెంకటేశ్వరరావు, కర్రి పాపారాయుడు, చెల్లుబోయిన శ్రీనివాస్, ముదునూరి మురళీకృష్ణరాజు, శెట్టిబత్తుల రాజబాబు, పితాని బాలకృష్ణ, కొవ్వూరి త్రినాథ్ రెడ్డి, ఉలవకాయల లోవరాజు, పేపకాయల వెంకటలక్ష్మి, పిల్లంక శ్రీనివాసరాజు, సబ్బెళ్ల కృష్ణారెడ్డి, కుడుపూడి భరత్ భూషణ్, కుడుపూడి బాబు, వాసిరెడ్డి జమీలు, తోట రామకృష్ణ, అల్లి రాజబాబు, లాలం బాబ్జీ, ఒమ్మి రఘురామ్, జమ్మలమడక నాగమణి పాల్గొన్నారు.

పరువు నష్టం దావా వేస్తా..

- ఆరోపణలు కాదు.. సాక్ష్యాధారాలతో నిరూపించండి
- గౌతమి సూపర్ బజార్ భూమి లీజు ఆరోపణలపై మాజీ ఎంపీ మార్గాని మండిపాటు
- సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అసత్య ప్రచారంపై ఆగ్రహం



మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: గౌతమీ సూపర్ బజార్ భూమిని అక్రమంగా అన్యాక్రాంతం చేశానని, లీజు విషయంలో తాను రూ.5 కోట్ల అవినీతికి పాల్పడ్డానని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చేసిన ఆరోపణల్లో ఎలాంటి నిజమూ లేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఈ ఆరోపణలు అసత్య ప్రచారమని కొట్టిపారేశారు. అధికారంలో ఉన్నందున ఆరోపణలు చేయడం కాకుండా సాక్ష్యాధారాలతో నిరూపించాలని, లేకుంటే పరువు నష్టం దావా వేస్తానని మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అధికార మదంతో, భుజాలు చరుచుకుని వాసు అసత్య ప్రచారం చేస్తే, చూస్తూ ఊరుకోబోమని అన్నారు. ఎమ్మెల్యే కదా ఎలాగైనా మాట్లాడవచ్చని అనుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఆదిరెడ్డి కుటుంబం మాదిరిగా తాను ఎలాంటి అవినీతికీ పాల్పడలేదని భరత్‌రామ్ స్పష్టం చేశారు. అవినీతికి అడ్డాగా కార్పొరేషన్‌ను మార్చుకుని, అడ్డగోలు వ్యవహారాలు, అక్రమ సంపాదనతో పేదల పొట్ట కొట్టిన చరిత్ర ఆదిరెడ్డి కుటుంబానికే ఉందని మార్గాని ఆరోపించారు. ఈవీఎంల మాయాజాలంతో ఎమ్మెల్యేగా గెలిచిన ఆదిరెడ్డి వాసు.. జాతీయ రహదారి పక్కన ఇసుక స్టాక్ పాయింట్ వద్ద రూ.10 కోట్ల విలువైన ఇసుకను హాంఫట్ చేసి, దందాకు తెర లేపారన్నారు. అలాగే, మద్యం దుకాణాలు, బార్ల కేటాయింపుల్లో భారీగా కమీషన్లు తీసుకున్నారని, సిండికేట్లతో కుమ్మక్కై తన అనుయాయులకు షాపులు కట్టబెట్టారని ఆరోపించారు. ఇవన్నీ కప్పిపుచ్చుకోడానికే గౌతమీ సూపర్‌బజార్ భూమి విషయంలో తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. ఆదిరెడ్డి వాసు ఒకపక్క సెటిల్‌మెంట్ల దందాలు చేస్తూ, మరోపక్క క్వారీ ఏరియాలో పేకాట క్లబ్బులు నిర్వహిస్తూ, ఎదుటి వారిపై బురద జల్లడం వింతగా ఉందని ఎద్దేవా చేశారు. ఎంపీగా ఐదేళ్లు నీతి, నిజాయితీతో అభివృద్ధే అజెండాగా పని చేశానని చెప్పారు. అయినప్పటికీ ఓర్వలేక తాను 25 శాతం కమీషన్లు తీసుకుంటున్నట్లు అప్పట్లో తప్పుడు ప్రచారంతో బురద జల్లే ప్రయత్నం చేశారని అన్నారు. నిజానికి ఎమ్మెల్యేగా గెలిచిన మరుక్షణం నుంచే ఆదిరెడ్డి వాసు కార్పొరేషన్‌లో అవినీతికి తెర లేపారని అన్నారు. మెయిన్ రోడ్డులో వ్యాపారులను బెదిరించి చీటీలు వేయిస్తున్నారని భరత్‌రామ్ ఆరోపించారు.

చిల్లర కష్టాలు



- మార్కెట్లో రూ.10, రూ.20 నోట్ల కొరత
- నాణేలు తీసుకోవడానికి నిరాకరిస్తున్న వ్యాపారులు
- ప్రజల్లో అనుమానాలు
- ఆర్‌బీఐ నివృత్తి చేసినా తప్పని చిక్కులు



బ్యాంక్ ఆఫ్ బరోడా దానవాయిపేట బ్రాంచి వద్ద రూ.10 నాణేలు పంపిణీ చేస్తున్న ఉన్నతాధికారులు (ఫైల్)



రాజమహేంద్రవరం రూరల్: కొద్ది రోజులుగా చిల్లర కష్టాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నాళ్లుగా రూ.10, రూ.20 నోట్ల లభ్యత తగ్గింది. దీంతో రైతుబజారులో కూరగాయలు, మార్కెట్‌లో వివిధ వస్తువుల కొనుగోలుకు వెళ్తున్న వారు చిల్లర సమస్యతో సతమతమవుతున్నారు. కొద్ది సంవత్సరాల కిందట పెద్ద నోట్లను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థను ఓ కుదుపు కుదిపింది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వం మొదట రూ.వెయ్యి నోట్లను రద్దు చేసి, కొత్తగా రూ.2 వేల నోట్లు ప్రవేశపెట్టింది. ఆ తర్వాత పాత రూ.500 నోట్లు కూడా రద్దు చేసి, వాటి స్థానంలో కొత్త డిజైన్‌తో నోట్లు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. వీటితో పాటు రూ.10, రూ.20 నాణేలు కూడా ప్రవేశపెట్టారు. ఈవిధంగా దేశీయ కరెన్సీలో దశాబ్ద కాలంగా పెను మార్పులు చోటు చేసుకున్నాయి.

తరచూ మార్పులతో సందేహాలు

రూపాయి నోటు నుంచి రూ.2 వేల నోటు వరకూ విభిన్న రంగులు, డిజైన్లలో నోట్లు చలామణీలోకి వచ్చాయి. అయితే, నాణేల నుంచి నోట్ల వరకూ డిజైన్లలో తరచూ జరుగుతున్న మార్పుల ప్రజల్లో పలు సందేహాలకు తావిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంకు నిబంధనల ప్రకారం రూ.10, రూ.20 నాణేలు పూర్తిగా చెల్లుబాటు అవుతాయి. అయినప్పటికీ, బరువు, చెల్లుబాటు అవుతాయో లేదోననే సందేహంతో వీటిని తీసుకునేందుకు కొన్ని ప్రాంతాల్లో వ్యాపారులు నిరాకరిస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో చాలా కాలం నుంచి మార్కెట్‌లోకి రూ.10, రూ.20 నాణేలు రావడం లేదు. సరిగ్గా ఇదే సమయంలో మార్కెట్‌లో రూ.10, రూ.20 నోట్లకు కూడా కొరత ఏర్పడింది. ఫలితంగా ప్రజలను చిల్లర కష్టాలు వేధిస్తున్నాయి. చాలాచోట్ల డిజిటల్ పేమెంట్లు చేస్తున్నప్పటికీ.. వీటిపై అవగాహన లేని కొంతమంది చిరు వ్యాపారులు, బడ్డీ కొట్ల వారు నగదు లావాదేవీలకే పరిమితమవుతూ చిల్లర కోసం కుస్తీలు పడుతున్నారు. ప్రభుత్వం ఆమోదించిన నాణేలను తిరస్కరించడం నేరమని, రూ.10, రూ.20 నాణేలు చెల్లుబాటు అవుతాయని, ఎవరైనా తిరస్కరిస్తే ఐపీసీ సెక్షన్-124 కింద ఫిర్యాదు చేయాలని ఆర్‌బీఐ సూచించింది.

నాణేలన్నీ చెల్లుబాటు అవుతాయి



రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన నాణేలు రూ.1, రూ.2, రూ.5, రూ.10, రూ.20 అన్నీ చెల్లుబాటు అవుతాయి. రోజువారీ క్రయవిక్రయాలకు వ్యాపారులు వీటిని నిరభ్యంతరంగా వినియోగించవచ్చు. ప్రభుత్వం ఆమోదించిన నాణేలను క్రయవిక్రయాలకు నిరాకరించడం చట్ట రీత్యా నేరం. వారిపై ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం.

– డీవీ ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్, తూర్పు గోదావరి జిల్లా

క్లుప్తంగా

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

– మరొకరికి తీవ్ర గాయాలు



ఘటనా స్థలంలో సూరిబాబు మృతదేహం

తుని రూరల్: తుని మండలం తేటగుంట శివారు పాత ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. ఎస్సై అందించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తునిలో శుభకార్యానికి హాజరై తిరిగి తమ స్వగ్రామం ప్రత్తిపాడు వెళ్లేందుకు అత్తి సూరిబాబు, సింధూరపు అనిల్ మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. దుర్గాడ నుంచి వస్తున్న దుంగల లోడు ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో సూరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అనిల్‌ను 108 అంబులెన్సులో తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎన్‌డీపీ మద్యంతో వ్యక్తి అరెస్ట్

అమలాపురం టౌన్: కేంద్ర పాలిత ప్రాంతం యానాం నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ (ఎన్‌డీపీ) మద్యం సీసాలను కోనసీమకు అక్రమంగా రవాణ చేసి అమ్ముతున్న సమాచారంపై ఈఎస్ టాస్క్‌ఫోర్స్ సీఐ లింగం చిరంజీవి ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది రావులపాలెం తదితర ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారు జామున విస్తృత తనిఖీలు చేశారు. రావులపాలేనికి చెందిన పున్నపు శరత్‌బాబు యానాం నుంచి అక్రమంగా తెచ్చిన 37 మద్యం సీసాలను అమ్ముతుండగా ఆకస్మిక దాడితో పట్టుకున్నట్లు సీఐ చిరంజీవి తెలిపారు. అతడిని అరెస్ట్ చేయడంతో పాటు అతని వద్ద నుంచి 37 యానాం ఎన్‌డీపీ మద్యం సీసాలు, అక్రమ రవాణాకు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటనలో తెలిపారు.

దొంగతనం కేసులో జైలు

గోపాలపురం: దొంగతనం కేసులో ఒక వ్యక్తికి నాలుగు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష విధించినట్లు గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం మండలం గంగోలు పంచాయతీ పరిధిలోని రాంపాలెం గ్రామంలో 28-05-2024వ తేదీన ఒక ఇంటిలోకి చొరబడి బీరువా పగులకొట్టి అందులో రూ.10వేల నగదును దొంగిలించిన ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం ఒంకబొత్తప్పగూడెంకు చెందిన పట్టెం కిషోర్‌పై కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో కొవ్వూరు కోర్టు న్యాయమూర్తి కె.నాగలక్ష్మి జైలు, రూ.500 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు గాయాలు

రౌతులపూడి: తుని ఎస్ఎస్ పట్నం వెళ్లే ఆర్టీసీ బస్సు మంగళవారం రోడ్డు ప్రమాదానికి గురై బస్సులో ప్రయాణిస్తున్న పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. తుని నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్సు రాత్రి ఏడున్నర సమయంలో ఎస్.అగ్రహారం బిళ్లవాక సమీపంలో రోడ్డుపై ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సు అద్దాలు పగిలి పలువురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

లే ఉమా.. లేరా పెద్దోడా..

- మృతదేహాలపై పడి భోరున విలపించిన భర్త
- విషాదం మిగిల్చిన విహార యాత్ర
- పంట కాలువలోకి దూసుకుపోయిన కారు
- భార్య, కుమారుడు మృతి, చిన్న కుమారుడి గల్లంతు
- నిద్ర మత్తు వల్లే ప్రమాదం?

లే ఉమా.. లేరా పెద్దోడా అంటూ అతడు భార్య, కుమారుడి మృతదేహాల వద్ద విలపించిన తీరు చూపరులను కలచి వేసింది. కోనసీమ జిల్లా ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద పంట కాలువలోకి కారు బోల్తా కొట్టిన ఘటన అతనికి తీవ్ర విషాదం మిగిల్చింది. అప్పట్లో కరోనా అతని ఉపాధిని దూరం చేయగా ఇప్పుడు జరిగిన ప్రమాదం భార్యను, కుమారుడిని శాశ్వతంగా దూరం చేసింది. విధి.. హృదయ విదారకంగా ఆడిన చదరంగం అతడికి నిండుశోకాన్ని మిగిల్చింది. భార్యాపిల్లలతో విహారయాత్రకని వెళ్లిన అతడు బతుకు యాత్రలో ఒంటరి అయిపోయాడు. అయినవారు పంట కాలువలో పడి కళ్ల ఎదుటే మునిగిపోతున్నా రక్షించుకోలేని నిస్సహాయ స్థితి అతని దుఃఖాన్ని కట్టలు తెంచుకొనేలా చేసింది.



ఉమ, రోహిత్ మృతదేహాలు

పి.గన్నవరం: కరోనా సమయంలో ప్రయివేటు పాఠశాలలు మూత పడటంతో అతడికి టీచర్ ఉద్యోగం పోయింది. జీవనాధారం లేకపోవడంతో కారును కొనుక్కుని డ్రైవింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. చివరికి అదే కారు మృత్యువు రూపంలో ఆ కుటుంబాన్ని కాటు వేయడంతో అతడు దుఃఖ సాగరంలో మునిగిపోయాడు. కళ్ల ఎదుటే భార్య, ఇద్దరు కుమారులు నీట మునిగిపోతుండటంతో కాపాడుకోలేక పోయానంటూ భర్త విజయకుమార్ విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. నిస్సహాయ స్థితిలో అతడు భార్య, కుమారుని మృతదేహాలపై పడి బోరున విలపించాడు. రెండు రోజుల పాటు విహార యాత్రలో ఎంతో ఆనందంగా గడిపిన కుటుంబ సభ్యులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో అతను కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు.

విహార యాత్ర ముగించుకుని వస్తుండగా..

పి.గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన నేలపూడి విజయకుమార్ కుటుంబం అరకులో రెండు రోజుల విహారయాత్ర ముగించుకుని కారులో ఇంటికి తిరిగి వస్తుండగా ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద మంగళవారం తెల్లవారు జామున 3 గంటలకు ప్రధాన పంట కాలువలోకి కారు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో భార్య ఉమ (31), పెద్ద కుమారుడు రోహిత్ (9) మృతి చెందగా, చిన్న కుమారుడు మనోజ్ (5) గల్లంతయ్యాడు. గల్లంతైన బాలుడి కోసం కాలువలో గాలిస్తున్నారు.



విహార యాత్రలో చివరిసారిగా తీసుకున్న ఫొటో. ఈ ప్రమాదం నుంచి భర్త బయట పడ్డాడు

ఉపాధి చూపిన కారే అదుపు తప్పి..

బీఎస్సీ బీఈడీ చదివిన విజయకుమార్ ఉద్యోగం లేక కారు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఖాళీ సమయాల్లో డ్రైవింగ్ కూడా నేర్పుతున్నాడు. అతని భార్య ఉమకు కూడా కారు డ్రైవింగ్ వచ్చు. వీరికి 2014లో వివాహమైంది. వీరి పిల్లలు రోహిత్ పి.గన్నవరం కాన్వెంట్‌లో మూడో తరగతి, మనోజ్ యూకేజీ చదువుతున్నారు. ఈ నేపథ్యంలో భార్యాభర్తలు ఇద్దరు పిల్లలతో కలిసి గత శుక్రవారం వనజంగి, అరకు ప్రాంతాలకు వెళ్లి ఎంతో ఆనందంగా గడిపారు. ఆదివారం రాత్రి 8.30 గంటలకు విశాఖపట్నం నుంచి తిరిగి ఇంటికి బయల్దేరారు. ఇంటికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈతకోట గ్రామం వచ్చేసరికి భర్తకు నిద్ర రావడంతో, తాను కారు నడుపుతానని భార్య చెప్పింది. దీంతో ఆమె కారు నడుపుతూ ఉండగా ముందు సీట్లో భర్త, వెనుక సీట్లో ఇద్దరు పిల్లలు నిద్రపోయారు. వారు ప్రయాణిస్తున్న కారు చింతావారిపేట వచ్చే సరికి అదుపుతప్పి పంట కాలువలో పడి మునిగిపోయింది. నీట్లో మునిగిన పెద్ద కుమారుడు రోహిత్‌ను తండ్రి ఒడ్డుకు చేర్చాడు. చుట్టూ చీకటి కారణంగా కంగారులో రోహిత్ మళ్లీ కాలువలోకి జారి పడి మునిగిపోయాడు. చిన్న కుమారుడు మనోజ్‌ను రక్షించే ప్రయత్నంలో భార్య ఉమ నీటి ప్రవాహంలో కొట్టుకు పోయింది. ముగ్గురినీ కాపాడేందుకు భర్త ప్రయత్నించి విఫలమయ్యాడు. కాలువ నుంచి పైకి వచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. ఎస్సై బి.శివకృష్ణ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన కొద్ది దూరంలోనే తల్లి ఉమ, పెద్ద కుమారుడు రోహిత్ మృతదేహాలను స్థానికులు వెలికి తీశారు. గల్లంతైన చిన్న కుమారుడు మనోజ్ కోసం కాలువలో గాలిస్తున్నారు. మృతదేహాల వద్ద భర్తతో పాటు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.



భార్య, కుమారుడి మృతదేహాల వద్ద బోరున విలపిస్తున్న భర్త విజయకుమార్

ఐదు నిమిషాలు అయితే ఇంటికి వెళ్లిపోయేవారు

మరో ఐదు నిమిషాలయితే ప్రమాదం జరిగిన ప్రాంతం నుంచి ఆ కుటుంబం ఇంటికి చేరేది. ఇంతలోనే వారు ప్రయాణిస్తున్న కారు కాల్వలోకి దూసుకుపోయిందని బంధువులు వివరించారు. రెండు నిమిషాలు అయితే రోడ్డు వెంబడి ఉన్న పంట కాలువను కూడా దాటి వెళ్లిపోయేవారు.

పోతవరంలో విషాద ఛాయలు

కారు ప్రమాదంలో తల్లీ కుమారుడు మృతి చెందడం, మరొక కుమారుడు గల్లంతు కావడంతో పోతవరం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే వారు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో బంధువులు భోరున విలపించారు. కోడలు ఉమ, మనుమలు రోహిత్, మనోజ్ కోసం ఇంటి వద్ద తాతయ్య, నానమ్మలు వీరవెంకట సత్యనారాయణ, లక్ష్మి రోదిస్తున్నారు. లేరా పెద్దోడా, లే ఉమా అంటూ మృతదేహాల వద్ద విజయకుమార్ విలపించిన తీరు హృదయ విదారకంగా ఉంది. ప్రమాద స్థలాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సీఐ ఆర్.భీమరాజు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై శివకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాలువ వైపున రెయిలింగ్స్ నిర్మించాలి

రాజవరం–పొదలాడ రోడ్డులో జి.పెదపూడి నుంచి సోంపల్లి వరకూ పంట కాలువ వైపున రెయిలింగ్స్ నిర్మించాలని ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు. రెయిలింగ్స్ లేకపోవడం వల్ల వాహనాలు కాలువలో పడిపోవడంతో పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే రెయిలింగ్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి



కారును వెలికి తీస్తున్న దృశ్యం

ఆక్వా రైతుల దాష్టీకం

హైకోర్టు ఆదేశాలు అతిక్రమణ



యువకుడిని నిర్బంధించిన దృశ్యం

ఉప్పలగుప్తం: హైకోర్టు ఆదేశాలను అతిక్రమించి ఓ యువకుడిని ఆక్వా రైతులు తాళ్లతో నిర్బంధించి చితకబాదిన ఘటన ఉప్పలగుప్తం మండలంలోని సన్నవిల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం సన్నవిల్లి గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా అనధికార ఆక్వా చెరువుల సాగు కొనసాగుతోంది. ఈ సాగుతో గ్రామంలో ఉన్న కొబ్బరి చెట్లు చనిపోతున్నాయి. గ్రామంలో స్వచ్ఛమైన తాగునీరు దొరకడం లేదు. బోరు నీరు ఉప్పునీరుగా మారుతోందని గ్రామానికి చెందిన చిక్కం వీర దుర్గాప్రసాద్‌తో పాటు కొంతమంది యువకులు 2018 సంవత్సరంలో హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆక్వా చెరువులతో గ్రామానికి నష్టం జరుగుతుందని ఆక్వా సాగును నిలిపివేయాలని హైకోర్టు 2023లో తీర్పునిచ్చింది. ఈ తీర్పును అతిక్రమించి గ్రామంలో కొంతమంది రైతులు సోమవారం మళ్లీ సాగు మొదలు పెడుతుండగా గ్రామానికి చెందిన చిక్కం వీర దుర్గాప్రసాద్ అనే మండల మత్స్యశాఖ అధికారి హేమానంద్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ అధికారి అక్కడ ఎటువంటి సాగు జరగటంలేదని వాదించి ఆధారాలు పంపమనటంతో ఆ యువకుడు ఆక్వా సాగు జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి ఫొటోలు తీసే క్రమంలో అదే గ్రామానికి చెందిన గనిశెట్టి వెంకట్రాజు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, చిక్కం గాంధీ ఆ యువకుడిని నిర్బంధించి చితకబాదటంతో యువకుడు వీర దుర్గా ప్రసాద్ అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సీహెచ్ రాజేష్ మంగళవారం తెలిపారు.

ఎంతకీ దొరకని ఆచూకీ

- అడవిలో పులి.. అందరిలోనూ అలజడి
- ముమ్మరంగా గాలిస్తున్న అటవీ అధికారులు
- భయం గుప్పిట్లో మన్యం వాసులు

ప్రత్తిపాడు రూరల్: కొద్దిరోజులుగా పెద్ద పులి బురదకోట గ్రామ పంచాయతీ పరిధిలో సంచరిస్తూ స్థానికుల్లో అలజడి రేకెత్తిస్తోంది. శనివారం బురదకోట గ్రామానికి చెందిన రైతు ముర్ల వెంకట్రావు గిత్త దూడపై పులి దాడి చేసింది. అధికారులు ఘటనా స్థలంలో లభించిన పాద ముద్రలను సేకరించారు. వీటి ఆధారంగా గిత్త దూడపై పులే దాడి చేసిందని అధికారులు నిర్ధారణకు వచ్చారు. దీంతో తాము అనుమానించిందే నిజం అయిందని గిరిజనులు భయపడుతున్నారు.

ఎటు వెళ్లిందో..

బురదకోట గ్రామ పంచాయతీ పరిధిలోని బాపన్నధారలొద్దులో దూడపై పులి దాడి చేసి నాలుగు రోజులు అవుతున్నా ఎక్కడా పులి జాడ కనిపించలేదు. పులి జాడ కోసం అటవీ శాఖ అధికారులు, సిబ్బంది ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే పులి జాడ ఎక్కడా లభించలేదు. బాపన్నధార దిగువన ఉన్న ధారపల్లిలో పులి కనిపించిందని అటవీశాఖ అధికారులకు సమాచారం రావడంతో ఆ ప్రాంతంలో అధికారులు క్షుణంగా గాలింపు చర్యలు చేపట్టారు. అయితే పులి జాడ లభించలేదు. వాతంగి వైపు పులి పాదముద్రలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే దూడపై దాడి చేసిన స్థలానికి ఇరువైపులా పులి జాడ లభించకపోవడంతో పులి ఎటువెళ్లిందనే దానిపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో ఘటనా స్థలానికి ఆనుకొని ఉన్న బాపన్నధార, కొండపల్లి, బురదకోట, కె.మిర్తివాడ గిరిజన గ్రామాలతో పాటు కొండ దిగువన ఉన్న ధారపల్లి, కిత్తుమూరిపేట, అటువైపు శంఖవరం మండలంలోని పెదమల్లాపురం, వేళంగి, అనుమర్తి, ఆవెల్తి, మరోపక్క తాడువాయి, దాపర్తి, సిద్దివారిపాలెం, శృంగధార గ్రామాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో పులి భయం పట్టుకుంది. ఆ గ్రామాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. అత్యవసర పనులు ఉంటే మినహా రాత్రివేళల్లో బయటకు రావద్దని, పశువులను, మేకలు, గొర్రెలను పొలాల్లో ఉంచవద్దని సూచిస్తున్నారు.



పులి కోసం అటవీ అధికారుల గాలింపు

పశువులను మేపేందుకు వెళ్లలేకపోతున్నాం



పులి సంచారంతో పశువులను మేపేందుకు వెళ్లలేకపోతున్నాం. పులి భయంతో పశువులకు ఇంటి వద్ద మేత పెట్టే పరిస్థితి లేదు. దీంతో భయపడుతూనే పశువులను గ్రామ పరిసరాల్లో మేపుతున్నాం. దీనివల్ల పశువులకు పూర్తి స్థాయిలో మేత దొరకడంలేదు. పులి జాడ కనిపెట్టి మాకు రక్షణ కల్పించాలి.

– చింతల బాలరాజు, బాపన్నధార

బయటకు రావాలంటే భయమేస్తోంది



పెద్ద పులి తమ ప్రాంతంలో సంచరించడంతో ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయమేస్తోంది. వ్యవసాయ పనులకు, అడవిలోకి వెళ్లలేక పోతున్నాం. ఏ క్షణంలో ఏం జరుగుతుందనే భయం మమ్మల్ని వెంటాడుతోంది. ఇప్పటికైనా అధికారులు పులి జాడ గుర్తించి మాకు రక్షణ కల్పించాలి.

– చింతల సరస్వతి, బాపన్నధార

మైదాన ప్రాంతానికి రావాలన్నా భయమే



పులి సంచారంతో మా ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి రావాలంటే భయమేస్తోంది. మేము నిత్యావసర వస్తువుల కోసం తప్పనిసరిగా మైదాన ప్రాంతానికి రావాల్సి వుంది. మూడు రోజులుగా పులి భయంతో ఇళ్లకే పరిమితమయ్యాం. దీంతో నిత్యావసర వస్తువుల కొరత నెలకొంది. అధికారులు పులి జాడను గుర్తించి మాకు రక్షణ కల్పించాలి.

– ముర్ల వెంకటలక్ష్మి, బాపన్నధార

టెన్త్‌లో నూరు శాతం ఫలితాలు



మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

ఆర్‌జేడీ నాగమణి సూచన

రాజానగరం: స్కేర్ట్ రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ని అమలుచేస్తూ, పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో నూరు శాతం ఫలితాలను సాధించే దిశగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి అన్నారు. మండలంలోని మల్లంపూడి, సాయి మాధవి ఇంజినీరింగ్ కళాశాల భవనంలో ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులకు పాఠశాల నాయకత్వ అభివృద్ధిపై ఇస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆమె సందర్శించారు. శిక్షణ తీరును పరిశీలించారు. అనంతరం వారినుద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేలా ప్రధానోపాధ్యాయులు నాయకత్వ పటిమను పెంపొందించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఆశించిన అభ్యసనను అందిస్తూ, మంచి ఫలితాలను సాధించేలా కృషి చేయాలన్నారు. డ్రాపౌట్స్‌ని నివారించడంతోపాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కలిగించి, నిరంతరం పరిశీలన ఉండాలన్నారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి గౌరీశంకరరావు, తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 233 మంది ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పాఠశాలలో మత్తు పదార్థాలపై విచారణ

రౌతులపూడి: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు సూచించారు. ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు మత్తు పదార్థాలను కలిగివుంటున్నారని వచ్చిన వార్త మేరకు మంగళవారం పోలీసులు విచారణ చేపట్టారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ విచారణలో గురుకుల జూనియర్ కళాశాలలో తనిఖీ చేపట్టారు. సిబ్బందిని, ఉపాధ్యాయులను, పారిశుధ్య కార్మికులను, వాచ్‌మన్‌లను ఆరా తీశారు. వసతి గదులను, కళాశాల ఆవరణను పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి మత్తుపదార్థాలు కనిపించలేదన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. గురుకుల పాఠశాల ఆవరణలో ఎలాంటి చట్టవ్యతిరేకమైన పనులు చేపట్టినా ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా కళాశాల ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు చేపడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులతో సమావేశమై అసాంఘిక కార్యక్రమాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు, ఎంఈఓ గాడి కొండబాబు పాల్గొన్నారు.

క్లాబాక్ కండిషన్ ఎత్తివేయాలి

ఎల్ఐసీ ఏజెంట్స్ మహాధర్నాలో ఆలిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లో క్లాబాక్ కండిషన్ ఎత్తివేయాలని ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఆలిండియా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.మంజునాథ డిమాండ్ చేశారు. మంగళవారం ఆలిండియా కమిటీ పిలుపుమేరకు ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం పక్కన రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు వై.విశ్వేశ్వరరావు అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎల్.మంజునాథ మాట్లాడుతూ ఇటీవల ఎల్ఐసీ క్లాబాక్ స్ట్రక్చర్‌ను మార్చడం, మినిమం బీమా మొత్తాన్ని రూ.రెండు లక్షలకు పెంచడం, పాలసీలో వయోపరిమితిని తగ్గించడం, ప్రీమియం రేట్లు పెంచడం చేసిందన్నారు. సౌత్ సెంట్రల్ జోన్ జనరల్ సెక్రటరీ పీఎల్ నరసింహారావు మాట్లాడుతూ ఎల్ఐసీ యాజమాన్యం ప్రవేశపెట్టిన నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.




మహాధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు. చిత్రంలో యూనియన్ నేతలు

రాజమండ్రి డివిజన్ గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల మనుగడకు భంగం కలిగించేవిధంగా యాజమాన్యం చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు టి.కోటేశ్వరరావు, జి.రవికోమధ్, సీఐటీయూ నాయకులు, వివిధ బ్రాంచిల యూనియన్ నేతలు, సుమారు 800 మంది ఏజెంట్లు పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కృషి

గ్రామీణ ఫౌండేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో సీటీఆర్ఐ ఒప్పందం

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఔత్సాహిక పారిశ్రామికులుగా 5,000 మంది మహిళలను తీర్చిదిద్దే దిశగా సీటీఆర్ఐ న్యూఢిల్లీ గ్రామీణ ఫౌండేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నామని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ తెలిపారు. మంగళవారం స్థానిక కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్ఐ) కార్యాలయంలో ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సమావేశానికి ముఖ్య అధ్యక్షుడిగా డాక్టర్ మాగంటి వ్యవహరించగా, గ్రామీణ ఫౌండేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ శత్రుప కాశ్యప్ విచ్చేశారు. మూడేళ్లకు కుదుర్చుకున్న ఈ ఒప్పందంతో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని స్వయం సహాయక బృందాలకు నైపుణ్య శిక్షణను కలిస్తామని శేషు మాధవ్ వివరించారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు, కృషివిజ్ఞాన కేంద్రం, కలవచర్ల హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్టులు, గ్రామీణ ఫౌండేషన్ అధికారులు సమన్వయంతో మహిళలకు శిక్షణ ఇస్తారని వివరించారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎల్.కె. ప్రసాద్, డాక్టర్ హెచ్. రవిశంకర్, డాక్టర్ బి.హేమ, కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, జేవీఆర్ సత్యవాణి, గ్రామీణ ఫౌండేషన్ అధికారులు పి.లక్ష్మి, ఎం.ఆనంద్ నాయక్ పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సీటీఆర్ఐ డైరెక్టర్ శేషు మాధవ్, గ్రామీణ ఫౌండేషన్ పీడీ కాశ్యప్



ఊరు ఉమెన్ అనుకున్నారా... నేషనల్!



ఆ ఊరి జనాభా పదకొండు వందలు కూడా ఉండదు. 'గ్రామాభివృద్ధికి జనాభా కాదు... చైతన్యం ప్రమాణం' అనుకుంటే చిల్లపల్లి చిన్న ఊరు కాదు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన పెద్ద ఊరు. కేంద్ర ప్రభుత్వం 'దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్' పురస్కారాలు ప్రకటించింది. అందులో 'ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయితీ' విభాగంలో పెద్దపల్లి జిల్లా మంథని మండలం చిల్లపల్లి గ్రామపంచాయితీకి రెండో ర్యాంకు వచ్చింది. నేడు ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముచేతుల మీదుగా చిల్లపల్లి గ్రామపంచాయతీ ఈ అవార్డులను అందుకోనుంది...

● చిల్లపల్లికి 'ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ'గా జాతీయ పురస్కారం ● నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

చిల్లపల్లి గ్రామంలో 1081 మంది జనాభా ఉండగా, అందులో 508 మంది మహిళలు ఉన్నారు. గ్రామంలో ఉన్న 33 స్వశక్తి సంఘాలలో 335 మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ 'శ్రీ జ్యోతి గ్రామ సమైక్య సంఘం' ఏర్పాటు చేసుకుని రూ.3.35కోట్ల వరకు వివిధ బ్యాంకుల నుంచి రుణాలు పొందారు. రుణవాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించడమే కాకుండా పొదుపు ఖాతాల్లో సైతం డబ్బును జమ చేస్తున్నారు. కిరాణాషాపులు, కుట్టు మిషన్‌లు, కోళ్ల పెంపకం, పాడిగేదెలు, కంగన్‌హాల్, చికెన్ షాప్, బ్యూటీపార్లర్, టిఫిన్‌సెంటర్‌లు, డ్రాగన్ ఫ్రూట్స్ తోట, పిండిగిర్ని, కూరగాయల సాగు, విక్రయం, మెడికల్ షాపు, ఐకేపీ సెంటర్ నిర్వహణ, అమ్మ ఆదర్శ పాఠశాల కింద ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టడం... మొదలైన పనులతో మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదుగుతున్నారు.

సక్సెస్ మంత్రం ఇదే...

కొన్ని గ్రామాల్లో మహిళ సంఘాలలోని సభ్యులు డబ్బులు పొదుపు చేసి, రుణాలు తీసుకొని బయట అధిక వడ్డీకి ఇవ్వడానికి ఇష్టపడతారు. దీనివల్ల సంఘాలకు, సభ్యులకు పెద్దగా ఉపయోగం ఉండదు. ఈ విషయాన్ని గ్రహించిన చిల్లపల్లి గ్రామ మహిళలు పొదుపు చేసిన డబ్బులతో పాటు, ప్రభుత్వం ఇచ్చే రుణాలను ఉపాధి కల్పన కోసం ఉపయోగిస్తున్నారు. దీనివల్ల తాము ఉపాధి పొందడంతో పాటు ఇతరులకు కూడా ఉపాధి చూపించగలుగుతున్నారు. రుణాలు తీసుకోవడంతో పాటు జీరో బకాయిలతో ముందుకు వెళుతున్నారు.

ఆర్థిక స్వావలంబన నుంచి ఆరోగ్య పరిరక్షణ వరకు చిల్లపల్లి ఆదర్శగ్రామంగా నిలుస్తోంది.

'గ్రామాల్లో ఉండడం దండగ' అనుకుంటూ ఉపాధి కోసం పట్నం బాట పడుతున్న ఎన్నో కుటుంబాలకు చిల్లపల్లి కొండంత ధైర్యాన్ని ఇస్తోంది. పట్టణంలో బతుకీడుస్తున్న వాళ్లను కూడా 'నేను నా ఊళ్లో హాయిగా బతక వచ్చు' అనుకునేలా భరోసా ఇస్తోంది. ఇంతకు మించిన విజయం ఏమిటి!

– గుడ్ల శ్రీనివాస్
సాక్షి, పెద్దపల్లి
ఫోటోలు: మర్రి సతీష్‌రెడ్డి

రైతు మిత్రులు



రమాదేవి, సరోజన, సౌజన్య... ముగ్గురు కలిసి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ధాన్యం వచ్చినప్పటి నుంచి తూకం వేసి మిల్లుకు తరలించే వరకు జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ప్రతి క్వింటాకు ప్రభుత్వం ఇచ్చే రూ.32 కమీషన్‌తో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. రైతులకు చేదోడు వాదోడుగా ఉండడంతో పాటు ఐకేపీ సెంటర్‌ల ద్వారా ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆ ఊళ్లో రోజూ పండగే!

ఆర్థిక స్వావలంబనలోనే కాదు ఆరోగ్యం, పారిశుధ్యంలోనూ చిల్లపల్లి ముందు ఉంటుంది. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉంది. బాలికలకు శానిటరీ న్యాప్కిన్స్‌పై, తల్లిదండ్రులకు పేరెంటింగ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు ఈ చిన్న ఊళ్లో గాఢమైన నిశ్శబ్దం రాజ్యమేలేది. పెద్ద సందడి ఉండేది కాదు. ఇప్పుడు అలా కాదు. 'ప్రతిరోజూ మా ఊళ్లో పండగే. సందడే' అన్నట్లుగా కనిపిస్తుంది. అది మహిళా చైతన్యానికి సంకేతమైన సందడి!

మినీ ఏటీఎంతో....



డ్వాక్రా సంఘంలో చేరిన తరువాత సుమారు ఐదుసార్లు లోన్ తీసుకున్నాను. మొదటిసారి తీసుకున్నప్పుడు గేదెలు కొనుగోలు చేశాను. ఆ అప్పు తీర్చి మళ్లీ లోను ఎత్తుకుని పిల్లల చదువులకు ఉపయోగించాను. మరోసారి లోన్ ఎత్తుకొని సెంట్రింగ్ కర్రలు కొనుగోలు చేసి అద్దెకు ఇస్తున్నా. తరువాత మినీ ఏటీఎం నిర్వహించేందుకు ల్యాప్‌టాప్ కొనుగోలు చేసేందుకు లోన్ తీసుకున్నా. మినీ ఏటీఎం నిర్వహణతో నెలకు పదమూడు నుంచి పదిహేను వేల వరకు ఆదాయం వస్తుంది.

– కూర వనిత
మినీ ఏటీఎం నిర్వాహకురాలు

అందుకే ఆదర్శంగా నిలిచింది



పన్నెండేళ్ల క్రితం మహిళ సంఘంలో చేరాను. అప్పటినుంచి ఇప్పటి వరకు ఆరుసార్లు రుణం తీసుకున్నా. మొదట్లో అయిదువేలు ఎత్తుకోని కుట్టుమిషన్ కొన్నాను. తరువాత లోన్లు తీసుకుంటూ మగ్గం, మెడికల్ షాపు ఏర్పాటు చేసుకున్నాను. స్త్రీనిధి కింద రూ.75వేలు తీసుకుని కిరాణాషాపు ఏర్పాటు చేసుకున్నాం. సంఘంలో లోన్ తీసుకోవడం, ఆ పైసలను సద్వినియోగం చేసుకోవడం, తిరిగి సకాలంలో చెల్లించడంలో మా గ్రామ సమాఖ్య ఆదర్శంగా నిలుస్తుంది.

– అరె.శ్వేత
మెడికల్ షాపు యజమాని

ఎన్నో గ్రామాలకు గెలుపు పాఠం



నలుగురు కలిస్తే ఎన్ని అద్భుతాలు సాధించవచ్చో నిరూపించింది చిల్లపల్లి. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఏ వ్యాపారానికైనా ఆర్థిక క్రమశిక్షణ ముఖ్యం. ఈ విషయంలో చిల్లపల్లి మహిళలు పర్ఫెక్ట్‌గా ఉన్నారు. 'ఫ్రెండ్లీ ఉమెన్ విభాగం'లో జాతీయ అవార్డు రావటం సంతోషంగా ఉంది. అయితే ఇది ఒక ఊరి విజయం మాత్రమే కాదు ఎన్నో గ్రామాలకు గెలుపు పాఠం. 'మనం కూడా ఇలా చేసి విజయం సాధించవచ్చు' అని ప్రతి గ్రామం ధైర్యం తెచ్చుకునే విజయం.

– సంతోషం పద్మ,
ఏపీఎం, మంథని

న్యూస్‌మేకర్



● పాయల్ కపాడియా



పుష్పా సరే పాయల్‌ని చూడండి

మన తెలుగు పుష్పా- 2 రికార్డు బద్దలు కొడుతోంటే అదే సమయంలో మన భారతీయ మహిళా డైరెక్టర్ 80 ఏళ్ల చరిత్ర గల గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో రెండు నామినేషన్స్ సాధించి రికార్డు స్థాపించింది. బెస్ట్ డైరెక్టర్ (మోషన్ పిక్చర్) బెస్ట్ మోషన్ పిక్చర్ (నాన్ ఇంగ్లిష్) కేటగిరీల్లో ఆమె దర్శకత్వం సినిమా 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్' నామినేషన్ పొందింది. ఇంతకు ముందు ఇలాంటి ఘనత సాధించిన మన దేశపు మహిళ మరొకరు లేరు.



'సినిమా తీయాలంటే అందరికీ ఫిల్మ్ స్కూల్ అక్కర్లేదు. కాని నాకు ఉపయోగపడింది' అంటారు పాయల్ కపాడియా. ముంబైలో, ఆంధ్రప్రదేశ్‌లోని రిషి వ్యాలీలో బాల్యం, కౌమారం గడిచిన పాయల్ పూణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో డైరెక్షన్ కోర్సు చదివి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన దర్శకురాలు అయారు. 2014 నుంచి సినిమాలు తీస్తున్నా 2021లో తీసిన డాక్యుమెంటరీ 'ఏ నైట్ ఆఫ్ నోయింగ్ నథింగ్'తో ఆమె ప్రతిభ లోకానికి పరిచయం కాసాగింది.

ఎవరికీ లేని ఘనత

ఆస్కార్ అకాడెమీ అవార్డ్స్‌తో సమానమైన ప్రతిష్ఠాత్మక గోల్డెన్ గ్లోబ్ అవార్డుల కోసం పోటీ పడే భారతీయ సినిమాలు చాలా తక్కువ. 1994లో చివరిసారిగా ఒక భారతీయ సినిమా నామినేషన్ పొందింది. ఆ తర్వాత ఇన్నాళ్లకు అదీ ఒక మహిళా దర్శకురాలిగా పాయల్ కపాడియా తాను తీసిన 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్'తో 2024 గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'బెస్ట్ డైరెక్టర్', 'బెస్ట్ ఫారిన్ లాంగ్వేజ్ ఫిల్మ్' విభాగం కింద రెండు నామినేషన్స్ పొందారు. ఇప్పటికే కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024లో రెండవ ప్రతిష్ఠాత్మకమైన బెస్ట్ డైరెక్టర్ అవార్డును (గ్రాండ్ ప్రి) పొందిన డింపుల్ కపాడియా గోల్డెన్ గ్లోబ్ అవార్డు కూడా సాధిస్తే ఆమె పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలబడిపోతుంది.

సినిమాలు చూస్తూ...

పాయల్ కపాడియా బాల్యంలో రిషి వ్యాలీలోనే సినిమాల మీద ఆసక్తి పెంచుకున్నారు. 'మా అమ్మా నాన్నలు నాకు చిన్నప్పుడు ప్రగతికాముక సినిమాలు చూపించేవారు. రష్యన్, ఫ్రెంచ్ సినిమాలు... ఆనంద్ పట్వర్ధన్ తీసిన డాక్యుమెంటరీలు చూస్తూ పెరిగాను. ఆ తర్వాత పూణెలో డైరెక్షన్ కోర్సులో చేరాక వేరు వేరు ప్రాంతాల, నేపథ్యాల నుంచి వచ్చిన బ్యాచ్‌మేట్స్ సినిమాల గురించి ఎన్నో చర్చలు సాగించేవారు. రోజూ స్క్రిప్టులు వినడమే సరిపోయేది. అదంతా చిన్న ఎక్స్‌పోజర్ కాదు. అలాగే ఇష్టం ఉన్నా లేకపోయినా ప్రాక్టికల్స్ ఉండేవి. అవి చేసే ముందు కష్టంగా ఉన్నా చేశాక ఏదో తెలుసుకున్నాం అనే సంతృప్తి ఉండేది. ఉదాహరణకు అందరూ తప్పనిసరిగా 4 నిమిషాల లాంగ్‌షాట్ తీయాలి మా ప్రాక్టికల్ ఫిల్మ్స్‌లో. ఎవరు ఎలా తీస్తారనేది ఒక అనుభవం. మా ప్రొఫెసర్లు కూడా ఎంతో బాగా పాఠాలు చెప్పారు. అవన్నీ నేను దర్శకురాలు కావడానికి సాయం చేశాయి' అంటారామె.


ముగ్గురు స్త్రీలు, ఒక నగరం

మూడు నాలుగేళ్లుగా రాసుకున్న స్క్రిప్ట్ 'ఆల్ వియ్ ఇమాజిన్ యాజ్ లైట్'ను తీయడానికి కావలసిన బడ్జెట్ కోసం ఫ్రాన్స్, ఇటలీ, లగ్జంబర్గ్, ఇండియా, నెదర్లాండ్స్‌లోని ప్రొడక్షన్ సంస్థలను ఆశ్రయించి వారి సహ భాగస్వామ్యంతో పూర్తి చేశారు పాయల్. కేరళ నుంచి ముంబైకి భుక్తి కోసం వచ్చిన ఇద్దరు నర్సుల కథ ఇది. వీరు పనిచేసే ఆస్పత్రిలోనే వంటమనిషిగా చేస్తున్న మహారాష్ట్ర మహిళ వీరితో కలుస్తుంది. ఆ నర్సుల్లో ఒకామె భర్త ఆమెను విడిచిపెట్టి జర్మనీ వెళ్లిపోయి ఉంటాడు. మరో నర్సు అవివాహితగా ఉంటూనే ఒక యువకునితో రిలేషన్‌లో ఉంటుంది. ఇక వంటామె ఇరవై ఏళ్లుగా తాను ఏ చాల్ (చిన్న కొట్టం)లో అయితే నివసిస్తోందో ఆ చాల్‌ను బిల్డర్ కూల్చడానికి వస్తే దానిని సొంతం అని చెప్పుకోవడానికి ఏ పత్రమూ లేక కలిగే నిస్పృహ... ఈ ముగ్గురి జీవితం ఎక్కడకు చేరుతుంది... ఏ వెలుతురికీ ప్రస్థానం అని చూపేదే కథ.

లోతైన కథనం

పాయల్ కపాడియా ఈ కథలో ఎన్నో పొరలు ఉంచి కథకు బహుముఖ పార్శ్వాలు ఇవ్వడమే ప్రపంచ విమర్శకులను ఆకర్షించి అవార్డుల పంట పండేలా చేస్తోంది. ఈ కథలో మూడు పాత్రలతో పాటు ముంబై నగరం కూడా ఒక పాత్రగా ఉండటం విశేషం. ఒక నగరం పెరిగే కొద్దీ పేదవాళ్లను దూరంగా నెట్టేస్తూ ఉంటుందని ఈ సినిమా చూపుతుంది. ఒకప్పటి మామూలు ఏరియా ఖరీదైన భవంతులతో నిండిపోతే అప్పటివరకూ అక్కడ ఉన్నవారు ఎక్కడకు వెళ్లి వుంటారు? ఎవరూ ఆలోచించరు. 'ఈ నగరం కలల నగరం అని కొందరు అనుకుంటారు. ఇది భ్రాంతుల నగరం. కలా నిజమా... తెలుసుకునే లోపే జీవితం గడిచిపోతుంది' అనే డైలాగ్ ఇందులో ఉంది. 'నువ్వు జీవితాన్ని తప్పించుకోలేవు' అనే డైలాగ్ కూడా ఉంది. తప్పించుకోలేని జీవితంలో తగిన ఆనందాలు వెతుక్కోవడం ఎలాగో ప్రతి జీవికీ తెలుస్తుంది. ఈ కథలోని ముగ్గురు స్త్రీలు ఆ ఆనందాలను వెతుక్కుని వెలుతురు పొందుతారు.

జనవరి 5న గోల్డెన్ గ్లోబ్ అవార్డుల ఈవెంట్ ఉంది. చూద్దాం మన అదృష్టం.



ఎగతాళి నుంచి సంతాలి రుచుల దాకా...

మధుస్మిత సోరెన్ ముర్ము ఓ ట్రెండ్‌సెట్టర్. సంతాలి ఆదివాసీ వంటకాలను, ఇటాలియన్ వంటకాల శైలితో మేళవించి కొత్త రుచులను ఆవిష్కరిస్తోంది. సంతాలి సంప్రదాయ వంటల గురించి బ్లాగ్‌లో రాస్తోంది. కొద్దిరోజుల్లోనే ఓ సెలబ్రిటీ హోదాను సొంతం చేసుకుంది మధుస్మిత. బాల్యంలో ఎదురైన చిన్న చూపు నుంచి ఎదిగిన విజయ కిరణం ఆమె. ఒడిశాలోని మయూర్ భంజ్ జిల్లా, రాయ్‌రంగపూర్ అమ్మాయి మధుస్మిత.



● మధుస్మిత



పోటీలో విజయం

ఆదివాసీల ఆహారపు అలవాట్లు నాగరక సమాజానికి భిన్నంగా ఉంటాయి. అడవుల్లో దొరికే చీమలు, నత్తలు, ఇతర కీటకాల వంటలు వారి ఆహారంలో ప్రధానంగా ఉంటాయి. లంచ్ బాక్సులో ఆమె ఆహారాన్ని చూసిన ఇతర విద్యార్థులు ఆమెను తక్కువగా చూసేవారు. అప్పటి నుంచి ఆమెలో తమ ఆహారపు అలవాట్లను నాగరకులు ఎందుకు తక్కువగా చూస్తారు... అనే సందేహం కలిగింది. ఆమెతోపాటే ఆమె సందేహం కూడా పెద్దదైంది. 'ఒడిశా హోమ్‌ఫుడ్ షెఫ్' పోటీల్లో గెలవడం మధుస్మితలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. తమ సంప్రదాయ వంటకాలను ఇతర ప్రాంతాల వంటకాల శైలితో మేళవించి వండడం అనే ప్రయోగం కూడా విజయవంతమైంది. బీటెక్ చదివేనాటికి ఆమెకు ఒక పరిష్కారం దొరికింది. ఆ పరిష్కారం విజయవంతం అవుతుందా లేదా అనే ప్రశ్నకు కోవిడ్ లాక్‌డౌన్ చక్కటి సమాధానాన్ని చెప్పింది. లాక్‌డౌన్ సమయంలో వంటల మీద పరిశోధనలు మొదలుపెట్టింది. లాక్‌డౌన్ తర్వాత సంతాలి వంటలు ఎన్ని రకాలున్నాయో తెలుసుకోవడానికి ఆ గ్రామాల్లో పర్యటించింది. ఎలా వండుతున్నారో తెలుసుకుంది. తెలుసుకున్న విషయాలను బ్లాగ్‌లో రాయడం మొదలుపెట్టింది. ఇప్పుడామె చెఫ్‌లకు శిక్షణనిస్తోంది. ప్రముఖ రెస్టారెంట్‌లలో సంతాలి తెగ వంటకాలు ప్రముఖ స్థానంలో కనిపిస్తున్నాయి. 2022లో మాస్టర్ షెఫ్ పోటీల్లో పాల్గొంది. ఆమె చేసిన రెండు వంటలు న్యాయనిర్ణేతల జిహ్వను మైమరిపించాయి. ఇటాలియన్ వంటకం పోలెంతాని మధుస్మిత స్థానిక పద్ధతిలో ఎర్రబియ్యంతో చేసింది. వేయించిన చికెన్‌కు తోడుగా ఎర్ర చీమల చట్నీ వడ్డించింది. అలాగే పాల్వా చట్నీతో పాట్లపీత వంటకం కూడా. ఎండిన చింతాకు పొడితో చేసిన వంటకాలను నగరవాసులు లొట్టలేసుకుని తింటున్నారు.

గవర్నమెంట్ ఉద్యోగం కంటే ఎక్కువ

''మా తల్లిదండ్రుల ఆలోచనలు చాలా సంప్రదాయబద్ధమైనవి. నేను బాగా చదువుకుని ఇంజినీరింగ్ పూర్తయిన తర్వాత గవర్నమెంట్ ఉద్యోగం చేయాలనుకునేవారు. కానీ నేను మాత్రం మా సంతాలి తెగ మీద సమాజంలో నెలకొని ఉన్న తేలిక అభిప్రాయాన్ని తొలగించాలనుకున్నాను. సంతాలి వంటకాలను తెలియచేసే ఫుడ్ బ్లాగర్‌గా ప్రపంచానికి పరిచయమయ్యాను. మా వంటలను పరిచయం చేశాను. ప్రపంచ పటంలో వంటకాల్లో ఇటలీకున్న స్థానంలో మా సంతాలి వంటకాలను చేర్చగలిగాను. పెద్ద పేరున్న రెస్టారెంట్‌లు మా వంటకాలకు మెనూ కార్డులో 'ట్రైబల్ క్విజిన్' అని ప్రత్యేక కేటగిరీ కల్పిస్తున్నారు. ఇప్పుడు మా సంతాలి వంటకాలు ప్రపంచ ఆహారపట్టికలో ఉన్నాయి. నేను అనుకున్నది సాధించాను'' అని సంతోషంగా చెప్తోంది 32 ఏళ్ల మధుస్మిత. బాల్యంలో మనసుకైన గాయంతో తమ సంతాలి తెగకు ప్రపంచస్థాయి గౌరవాన్ని తెచ్చి పెట్టింది మధుస్మిత సోరెన్ ముర్ము.

ప్రతిష్ఠాత్మక పదవిలో...



● అనౌష్క కాలే

ఇరవై సంవత్సరాల బ్రిటిష్-ఇండియా స్టూడెంట్ అనౌష్క కాలే కేంబ్రిడ్జిలోని చారిత్రాత్మకమైన 'కేంబ్రిడ్జి యూనియన్ డిబేటింగ్ సొసైటీ' అధ్యక్షురాలిగా ఎన్నికైంది. కేంబ్రిడ్జి యూనివర్శిటీలో ఇంగ్లీష్ సాహిత్యం చదువుతున్న కాలే ఈ ప్రతిష్ఠాత్మక పదవిని చేపట్టిన అతి కొద్దిమంది దక్షిణాసియా మహిళల్లో ఒకరిగా నిలిచింది.

'ఎంతో చరిత్ర కలిగిన కేంబ్రిడ్జి యూనియన్ సొసైటీకి అధ్యక్షురాలిగా ఎన్నిక కావడాన్ని గౌరవంగా భావిస్తున్నాను' అంటుంది అనౌష్క.

వివిధ సాంస్కృతిక సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా యూనియన్‌లో మరింత వైవిధ్యాన్ని తీసుకువస్తాను అని చెబుతుంది. గ్లోబల్ డిబేట్స్‌పై తనకు ఉన్న ఆసక్తిని తెలియజేసింది. ఇంటర్నేషనల్ స్పీకర్స్‌కు ఆతిథ్యం ఇవ్వడంపై ప్రధానంగా దృష్టి సారించింది.

లీగల్

అవి ఒరిజినల్ దస్తావేజులతో సమానం

మేము 15 సంవత్సరాల క్రితం ఒక అపార్ట్‌మెంట్‌లో ఫ్లాటు కొన్నాము. ఇప్పుడు అమ్మాలి అనుకుంటున్నాము. అయితే కొన్ని సంవత్సరాల క్రితం మా ఒరిజినల్ దస్తావేజులు పోయాయి. మేము రెవెన్యూ ఆఫీసు నుంచి సర్టిఫైడ్ కాపీలను తీసుకున్నాము. ఆ కాపీల ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి అని కొనుక్కునే వారికి చెప్పగా వారు వెనుకడుగు వేస్తున్నారు. కొందరేమో 'కాగితాల పని మేము చూసుకుంటాము కానీ పాతిక లక్షలు తక్కువ ఇస్తాం..' అంటున్నారు. నాకు ఏం చేయాలో పాలు పోవడం లేదు. దయచేసి పరిష్కారం చూపగలరు.

– విజయ్ వర్ధన్, వరంగల్

ఇంటి రిజిస్ట్రేషన్ / పూర్వ ఒరిజినల్ పత్రాలు లేనప్పుడు కొనేవారు కొంత సంకోచించడం సమంజసమే. ఒరిజినల్ దస్తావేజులని ప్రైవేటు వ్యక్తుల దగ్గర తాకట్టుపెట్టి తర్వాత అదే ఆస్తిని మరొకరికి అమ్మడం తరచుగా జరుగుతూ ఉంటుంది. ప్రైవేట్ తాకట్టు ఈ.సీ లో కూడా కనపడదు కాబట్టి కొనుక్కునేవారు అమాయకంగా మోసపోతూ తర్వాత కోర్టుల చుట్టూ తిరగడం సర్వసాధారణం అయిపోయింది. టైటిల్ డీడ్ డిపాజిట్ చేస్తే తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలి అనే నిబంధన లేకపోవడం ఇందుకు కారణం.

ఒరిజినల్ దస్తావేజులు లేని కారణం చూపించి మార్కెట్ విలువ కన్నా తక్కువ ధరకు మాత్రమే కొంటాము అని చాలామంది అంటారు. ఒరిజినల్ పత్రాలు లేనంత మాత్రాన ఆ స్థలం కానీ, ఇల్లు కానీ మీది కాకుండా పోదు, మీకు మీ ఆస్తిని అమ్మే హక్కు లేకుండా పోదు! మీరు తక్షణమే మీ ఇంటి పత్రాలు పోయాయి అని పోలీసులకి ఫిర్యాదు ఇవ్వండి. అదే విధంగా మీరు ఒక లాయర్ ద్వారా పేపర్ ప్రకటన కూడా ఇవ్వవలసి ఉంటుంది. అలా ఇచ్చిన ప్రకటన కాపీలను మరలా పోలీసు వారికి అందించాలి. పోలీసు వారు 'ఫలానా వారి దస్తావేజులు పోయాయి, తిరిగి వెతికినా దొరకడం లేదు' అని ధ్రువీకరిస్తూ ఒక సర్టిఫికెట్ (నాన్ ట్రేసబుల్ సర్టిఫికెట్) జారీ చేస్తారు. ఆ సర్టిఫికెట్‌ను తీసుకొని మీరు రెవెన్యూ అధికారుల దగ్గర దరఖాస్తు చేసుకుంటే మీకు డూప్లికేట్ కాపీలు ఇస్తారు. అలా పొందిన పత్రాలు ఒరిజినల్ దస్తావేజులతో సమానం. మీరు వివరించిన పరిస్థితులలో అమ్మే వారికి - కొనేవారికి కూడా ఇది సురక్షితమైన పరిష్కారం.



– శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

హక్కుల గొంతుక



● హర్మీత్ కే ధిల్లాన్

భారత సంతతికి చెందిన లాయర్ హర్మీత్ కే ధిల్లాన్‌ను న్యాయశాఖ అసిస్టెంట్ అటర్నీ జనరల్(సివిల్ రైట్స్)గా నామినేట్ చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు.

'పౌరహక్కులను కాపాడడానికి హర్మీత్ గట్టిగా నిలబడింది. హర్మీత్ సమర్థవంతురాలైన న్యాయవాది' అని 'ట్రూత్' సోషల్ పోస్ట్‌లో రాశాడు ట్రంప్.

పంజాబ్‌లో పుట్టింది హర్మీత్ ధిల్లాన్. తండ్రి తేజ్‌పాల్‌సింగ్ ధిల్లాన్ ఆర్థోపెడిక్ సర్జన్. అతడు యూఎస్‌లో అడుగుపెట్టినప్పుడు హర్మీత్ చిన్న పిల్ల. తేజ్‌పాల్‌సింగ్ కుటుంబం నార్త్ కరోలినాలోని స్మిత్‌ఫీల్డ్‌లో స్థిరపడింది. 'డార్ట్ మౌత్ కాలేజీ'లో చదువుకున్న హర్మీత్‌కు హైస్కూల్ రోజుల నుంచి రచనలు చేయడం అలవాటు

కాలేజీ మ్యాగజైన్ 'ది డార్ట్ మౌత్ రివ్యూ'కు ఎడిటర్-ఇన్-చీఫ్‌గా పనిచేసింది.

స్కూల్ ప్రెసిడెంట్, అతని విధానాలను విమర్శిస్తూ వ్యంగ్యాత్మక రచన చేసింది. వివక్షపూరిత విధానాల ప్రెసిడెంట్‌ను హిట్లర్‌తో పోల్చింది. ఈ సెటైర్ పెద్ద వివాదంగా మారింది.

'డార్ట్ మౌత్'లో చదువు పూర్తయిన తరువాత 'వర్జీనియా యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ లా'లో చదువుకుంది. 'వర్జీనియా లా రివ్యూ' ఎడిటోరియల్ బోర్డ్‌లో పనిచేసింది.

అమెరికాలోని టాప్ ఎలక్షన్ లాయర్‌లలో ఒకరిగా పేరు తెచ్చుకున్న హర్మీత్ ధిల్లాన్ ట్రంప్ 2020 ఎలక్షన్ క్యాంపెయిన్‌లో లీగల్ అడ్వైజర్‌గా పనిచేసింది.